www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 322 | పేజీలు : 4 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | గురువారం 01-08-2024

MHR TV
www. mhrtv.com

## గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ

**శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన సీఎం రేవంత్**

**హైకోర్టు జస్టిస్ అలోక్ ఆరాధే సమక్షంలో బాధ్యతల స్వీకరణ**

హైదరాబాద్, జూలై 31, ప్రజాస్వరం : తెలంగాణ నూతన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. అయనకు శంషాబాద్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. సాయంత్రం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే రాజ్ భవన్ లో జిష్ణు దేవ్ వర్మ చేత పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా బాధ్యతలు చేపడుతున్న జిష్ణుదేవ్ వర్మ



## యూపీఎస్సీ చైర్ పర్సన్‌గా ప్రీతి సూదన్

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**

**1983 ఏపీ క్యాడర్ బ్యాచ్** | 2





## గద్వాల ఎమ్మెల్యే ఘర్ వాపసీతో బీఆర్ఎస్‌లో నయా జోష్

**ప్రచారంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య, డాక్టర్ సంజయ్ పేర్లు**

# మరో ముగ్గురు..?

- పునరాలోచనలో వలువురు వలస వెళ్లిన ఎమ్మెల్యేలు
- స్థానికంగా లోకల్, నాన్ లోకల్ విభేదాలతో ఇబ్బందులు
- బీఆర్ఎస్ ఇచ్చిన ప్రయారిటీ కాంగ్రెస్‌లో లేదనే భావన
- సన్నిహితుల ద్వారా గులాబీ అధిష్టానంతో మంతనాలు





**హైదరాబాద్, జూలై 31, (ప్రజాస్వరం):** గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎపిసోడ్ తెలంగాణ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఇటీవల గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణమోహన్ రెడ్డి కొన్ని రోజుల్లోనే మనసు మార్చుకున్నారు. కాంగ్రెస్ కు కటిఫ్ చెప్పి తిరిగి సొంత గూటికీ చేరుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బండ్ల తిరిగి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బండ్ల ఎపిసోడ్ తో స్టేట్ పాలిటిక్స్ లో కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. అధికార కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కు కౌంటర్ గా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఘర్ వాపసీకి తెరలేపినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గులాబీ గూటికీ తిరిగి వచ్చారని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ మొదలైంది. రాష్ట్రంలో గులాబీ పార్టీ పవర్ కోల్పోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో పూర్ ఫెర్మామెన్స్ ప్రదర్శించడంతో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇందులో ఒకరే. తాజాగా బండ్ల మనసు మార్చుకుని మళ్లీ సొంత గూటికీ చేరుకోవడంతో.. బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా బండ్ల దారిలోనే వచ్చేందుకు సిద్ధమైనట్లు పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ తో బంధం తెంచుకుని బయటకు వెళ్లిన జగిత్యాల ఎమ్మెల్యే మిగతా 2 లో..

విలేకరులు కావలెను
ప్రజాస్వరం
పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999

## ముందే హెచ్చరించాం



- కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు
- ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ఇంత ప్రాణ, ఆస్తి నష్టం జరిగేదికాదు
- వర్షాల ప్రారంభంలోనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాం | 2
- ప్రకృతి విపత్తులను వారం ముందే పసిగట్టే టెక్నాలజీ మన వద్ద ఉంది
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

# ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా?



## 30 వేల జాబులిచ్చామని అబద్ధాలు చెబుతున్నారు

- ఎక్కడైనా ఇచ్చినట్టు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా
- రైతు భరోసాకు బడ్జెట్ ఏదీ..?
- భట్టి విక్రమార్కకు సీఎం అయ్యే అర్హత ఉంది
- కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయడం మీ తరం కాదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 31, (ప్రజాస్వరం):** కాంగ్రెస్ హయాంలో ఒక్క ఉద్యోగం ఇచ్చిందని తెలంగాణ యువకులు చెబితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్. అధికారంలోకి వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దాలు చెబుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా మిగతా 2 లో..




# నాలుగో నగరం నిర్మిస్తాం...

## ముచ్చర్ల మన భవిష్యత్ నగరం కాబోతుంది


- మెట్రో సౌకర్యం కూడా కల్పిస్తాం..
- బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ కాంట్రాక్టు బినామీలకిచ్చారు
- ఎంఎంటీఎస్ ఎయిర్ పోర్టు వరకు వేయకుండా అడ్డుకున్నారు
- ఏఐని వ్యవసాయానికి అనుసంధా నించేందుకు చర్యలు
- హైదరాబాద్‌లోని స్టేడియాలు తాగు బోతులకు అడ్డాలయ్యాయి
- అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ జూలై 31, (ప్రజాస్వరం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో తనకు కేటాయించిన సమయాన్ని సభను తప్పుదోవ పట్టించడానికి వినియోగించుకోవాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. సూచన అనే ముసుగులో మోసం అనే ప్రణాళికను ప్రజల మెదళ్లలో జొప్పిస్తున్నారన్నారు. పదేళ్ల మీ పాలనలో మీ అనుభవాలు మీకు ఉన్నాయని.. ప్రజల అనుభవాలు వారికి ఉన్నాయన్నారు. మీ పాలన అనుభవాలతో ప్రజలు మాకు అధికారం మిగతా 2 లో..




## మహేశ్ బ్యాంక్‌లో ఈడీ రైడ్స్

- హైదరాబాద్‌లో ఆరు కీలక ప్రాంతాల్లో ఏక కాలంలో తనిఖీలు
- రూ.300 కోట్ల నిధుల గోల్ మాల్ పై విచారణ
- అనర్హులకు రుణాలిచ్చినట్టు ఆరోపణలు
- హవాలా ద్వారా డబ్బు మళ్లించినట్టు విమర్శలు
- ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేసిన పోలీసులు | 2
- ఖాతాదారుల భద్రత విషయంలో గతంలోనే మందలించిన ఆర్బీఐ



## అమరావతికి ఇన్నర్ రింగ్ రోడ్డు

విజయవాడ, జూలై 31 , (ప్రజాస్వరం) : తాడేపల్లి-మంగళగిరితో పాటు పలు ప్రాంతాలు ఐఆర్ఆర్ లోపలికి తెస్తూ ప్రతిపాదన సుమారు 97.5 కిలోమీటర్ల పొడవుతో ఐఆర్ఆర్ నిర్మించే ఛాన్స్.. అమరావతి అభివృద్ధిపై దృష్టి సారించిన మిగతా 2 లో..

**97.5 కిలోమీటర్ల పొడవునా నిర్మించే అవకాశం**


**రూ. 6,878 కోట్ల అంచనా వ్యయం**

**ప్రతిపాదనను పరిశీలిస్తున్న ఏపీ ప్రభుత్వం**

## మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

పథకాలు, కార్యక్రమాల కోసం రూ.13,412 కోట్లు ఖర్చు | 2

పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి



## యూపీఎస్సీ కొత్త చైర్ పర్సన్‌గా ప్రీతి సూదన్

హైదరాబాద్,, జూలై 31 : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కొత్త చైర్ పర్సన్ గా ప్రీతి సుదాన్ ను కేంద్రం నియమించింది. 1983 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్ కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రీతి సుదాన్. సూదాన్ ఇంతకు ముందు యూపీఎస్సీలో సభ్యురాలిగా ఉన్నారు. ఆమె ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పని చేశారు.

## కారు బీభత్సం.. ఇద్దరికి గాయాలు

**హైదరాబాద్ (ప్రజాస్వరం):** జూబ్లీహిల్స్ చెక్పోస్టు వద్ద అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో బీటెక్ విద్యార్థి సాకేత్ రెడ్డి తన మిత్రుడితో కలిసి కారును డ్రైవింగ్ చేశాడు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు నుంచి కృష్ణానగర్ వైపునకు వెళ్లే మార్గంలో కారు అదుపు తప్పింది. కారు ఫుట్ పాత్ పైకి చేరుకుని చెట్లతో పాటు.. అక్కడున్న టెలిఫోన్ స్థంభంపై కెక్కి అమాంతంగా కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న సాకేత్ రెడ్డితో పాటు.. అతని మిత్రుడికి గాయాలయ్యాయి. కారులోపల ఇరుక్కుపోయిన ఇద్దర్నీ స్థానికులు బయటకు వెలికితీశారు. కారు డ్రైవర్ సాకేత్ రెడ్డికు పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. మద్యం మోతాదు 146 పాయింట్లుగా నమోదైంది. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దర్నీ జూబ్లీహిల్స్ పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

## నిండుకుండలా శ్రీశైలం

### పది గేట్లు ఎత్తి నీటి విడుదల

**శ్రీశైలం (ప్రజాస్వరం):** ఎగువ ప్రాంతాల నుంచి గంట గంటకు కృష్ణా వరద ప్రవాహం పెరుగుతుండడంతో శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. దీంతో మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి శ్రీశైలం పది గేట్లను పది అడుగుల మేర పైకి ఎత్తి దిగువ సాగర్కు 2,75,700 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. జూరాల నుంచి 2,81,196 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 1,07,246 క్యూసెక్కులతో కలిపి 3,88,442 క్యూసెక్కుల నీరు శ్రీశైలంలోకి వచ్చి చేరుతున్నాయి. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 207.4103 టీఎంసీలుగా నమోదైంది.తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 35,315 క్యూసెక్కుల నీటితో 18.437 మిలియన్ యూనిట్ విద్యుత్తు ఉత్పత్తిని, కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో 25,684 క్యూసెక్కుల నీటితో 15.201 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్కు 60,999 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడుకు 20,917 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్కు 1600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



## సీఎం రేవంత్‌ను కలిసిన మంత్రాలయం పీఠాధిపతి

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ కలిశారు. ఆగష్టు 20,21,22న మంత్రాలయంలో జరిగే రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలకు ముఖ్యమంత్రిని పీఠాధిపతి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, చిట్టెం పర్ణికా రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 31 (ప్రజాస్వరం):** మెహబూబ్ దిల్ సే పేరుతో సోషల్ మీడియాలో యువకుడు పాపులర్. యూట్యూబ్ కోసం కొన్ని మ్యూజిక్ వీడియోలు చేశాడు. ఆ తర్వాత 'బిగ్ బాస్' రియాలిటీ షోకి రావడం వల్ల ఇంకాస్త ఎక్కువ మంది బుల్లితెర వీక్షకులకు తెలిశాడు. సాంగ్స్, గేమ్ షోస్, ఇంకా ఇన్స్టాగ్రామ్ వల్ల మెహబూబ్ కాస్త గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు అతడి మీద పోలీస్ కేసు నమోదు అయ్యింది. పూర్తి వివరాల్లోకి వెళితే...

**బర్త్ డేకి బుల్లితెర నటీనటులతో పార్టీ!**

జూలై 29న మెహబూబ్ బర్త్ డే. ఈ సందర్భంగా టీవీ ఇండస్ట్రీలో తన క్లోజ్ ఫ్రెండ్స్ కొంత మందితో కలిసి పార్టీ చేసుకున్నారు. హైదరాబాద్ సిటీ పరిధిలోని మేడ్చల్ జిల్లాలో గల ఘట్ కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కంటైనర్ రిసార్టు బుక్ చేసుకున్నారు. అయితే, ఆ పార్టీ పోలీసు రికార్డుల్లోకి ఎక్కింది. మెహబూబ్ తీరు మీద పలు విమర్శలు వస్తున్నాయి.
బర్త్ డే పార్టీనా? విచ్చలవిడి రేవ్ పార్టీనా? మెహబూబ్ దిల్ సేతో పాటు అతని స్నేహితులు సోమవారం మిడ్ నైట్ ఏర్పాటు చేసుకున్న పార్టీ బర్త్ డే పార్టీ కాదని, అది రేవ్ పార్టీ అని ఆరోపణలు వస్తున్నాయి. పైకి పోలీసులు బర్త్ డే పార్టీ అని చెబుతున్నప్పటికీ... అక్కడ రేవ్ పార్టీ జరిగిందని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. మెహబూబ్ షేక్ తో పాటు పార్టీ ఆర్గనైజర్ మీద కూడా పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. ఆ పార్టీకి ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి లేదట. పార్టీ నిర్వహించిన రిసార్టులో 10 లీటర్ల లిక్కర్ బాటిల్స్, ఐదు లీటర్ల బీర్ బాటిళ్లు లభించడంతో పలు విమర్శలకు, వివాదానికి కారణం అయ్యింది. మెహబూబ్ దిల్ సేతో పాటు పలు వీడియోల్లో డ్యాన్స్ చేసిన అతని ఫ్రెండ్, ఢీ షో కంటెస్టెంట్ శ్వేతా నాయుడు, 'బిగ్ బాస్' ఫేమ్ గీతూ రాయల్, శ్రీ సత్యతో పాటు టీవీ నుంచి సినిమాలకు వచ్చి విజయాలు అందుకుంటున్న 'విరూపాక్ష' ఫేమ్ రవికృష్ణ సహా పలువురు ఈ పార్టీలో పాల్గొన్నారు.

# ముందే హెచ్చరించాం

- కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు
- ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ఇంత ప్రాణ, ఆస్తి నష్టం జరిగేదికాదు
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ, జూలై 31 : వయనాడ్ విపత్తుపై రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ముందస్తు హెచ్చరికలు ఇచ్చినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. జులై 23వ తేదీనే కేరళ ప్రభుత్వాన్ని హెచ్చరించామని స్పష్టం చేశారు. కొండచరియలు విరిగి పడే ప్రమాదముందని, భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతుందని ముందే అప్రమత్తం చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఈ ఘటనలో 163 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 200 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 180 మంది గల్లంతయ్యారు. కేరళలో భారీ వర్షాలు మొదలైన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రానికి 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపినట్టు వివరించారు అమిత్ షా. కానీ కేరళ ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్ని సరైన సమయంలో అలెర్ట్ చేయలేదని, వాళ్లను వేరే చోటకు తరలించలేదని ఆరోపించారు. ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించే ప్రమాదముందని తెలిస్తే వారం రోజుల ముందే అలెర్ట్ చేసే టెక్నాలజీ భారత్ వద్ద ఉందని తేల్చి చెప్పారు. ప్రపంచంలో ఇలాంటి సాంకేతికత ఉన్న నాలుగు దేశాల్లో భారత్ కూడా ఒకటి అని తెలిపారు. కేరళ ప్రభుత్వం కాస్త ముందే అప్రమత్తమై ఉంటే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని అన్నారు. కేరళ ప్రభుత్వానికి మోదీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వయనాడ్ విపత్తుని కచ్చితంగా ఎదుర్కొంటామని వెల్లడించారు.

కాగా, ఇప్పటికే కేంద్రమంత్రి జార్జ్ కురియన్ అక్కడి పరిస్థితులు సమీక్షించేందుకు వెళ్లారు. రిలీఫ్ క్యాంప్ లలో తలదాచుకున్న బాధితులను పరామర్శించారు. రెస్క్యూ ఆపరేషన్ ఎలా జరుగుతోందో సమీక్షించారు. కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి 163 మంది ప్రాణాలు కోల్పోయారని సమాచారం అందింది. అయితే..ఈ మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. కొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నారని వెల్లడించారు.

# నాలుగో నగరం నిర్మిస్తాం...

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారన్నారు. పదేళ్ల పాలన చేసిన వారు పది నెలలు పూర్తి చేసుకొని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ముచ్చర్లలో నాలుగో నగరాన్ని నిర్మిస్తున్నా మని.. మన భవిష్యత్ నగరంగా ముచ్చర్ల కాబోతుందని.. మెట్రో సౌకర్యం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ చీరల పథకంలో అవినీతి జరిగిందన్నారు. నేత కార్మికులకు పని కల్పించామంటూ అబద్దాలు చెప్పారని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరల డబ్బులు బకాయి పెడితే మేం చెల్లించామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బతుకమ్మ చీరల కాంట్రాక్ట్ బినామీలకు అప్పగించారని. సూరత్ నుంచి కిలోల చొప్పున చీరలు తెచ్చి కమీషన్ కొట్టేశారని రేవంత్ ఆరోపించారు. ఎంఎంటీఎస్ ను విమానాశ్రయం వరకూ వేస్తామంటే అనుమతి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీని వెనుక ఆర్థిక కుట్ర ఏంటో అందరికి తెలియాలన్నారు. మేమెప్పుడు మీలాగా పాతబస్తీని ఇస్తాంబుల్ చేస్తామని చెప్పలేదన్నారు. హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరినీళ్లలాగా మార్చుతామనలేదని రేవంత్ ఎద్దేవా చేశారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని. టూరిజం హబ్ క్రియేట్ చేస్తామంటున్నామని తెలిపారు. ప్రపంచస్థాయి వైద్యం హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏషియన్ గేమ్స్ నిర్వహించిన హైదరాబాద్ లో.. స్టేడి యాలన్నీ తాగుబోతుల అడ్డాగా మారాయని రేవంత్ పేర్కొన్నారు. ఒలిం పిక్స్ లో కాంస్యం వస్తేనే వందకోట్ల మంది సంబరపడే పరిస్థితి నెలకొందన్నారు. నిఖత్ జరీన్ కు ఉద్యోగం ఇస్తామని చెప్పి మీరు ఇవ్వలేదని రేవంత్ అన్నారు. మహ్మద్ సిరాజ్ కు గ్రూప్1 ఉద్యోగం ఇస్తున్నామన్నారు. ఫార్మాసిటీ అని



వాళ్లన్నారని.. మేం ఫార్మా విలేజ్ లు అంటున్నామన్నారు. వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీలు పెడితే ఆ ప్రాంతమంతా కలుషితమవుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను వ్యవసాయానికి అనుసంధానం చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కేటీఆర్ 100 శాతం ఆర్టిఫీషియల్, సున్నా శాతం ఇంటెలిజెన్స్ అన్నారు. ముచ్చర్లలో గొప్ప నగరం సృష్టిస్తున్నా మని రేవంత్ అన్నారు. ఎన్నికలైపోయాయని. ప్రతిపక్షంగా మీ పాత్ర పోషించాలని హితవు పలికారు. కేసీఆర్ చీల్చి చెండాడుతా అంటే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకొని వచ్చాన న్నారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీ, ఐటీ, ఎక్సైజ్ పాలసీలు తీసుకొస్తామని రేవంత్ పేర్కొన్నారు.

# మహేశ్‌బ్యాంక్‌లో ఈడీ రైడ్స్

**హైదరాబాద్, జూలై 31 :** హైదరాబాద్ లోని మహేష్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేపట్టారు. బ్యాంకుకు సంబంధించిన ఆరు కీలక ప్రాంతాల్లో ఏక కాలంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహిస్తున్న ఇళ్లల్లో మహేష్ బ్యాంక్ చైర్మన్ రమేష్ కుమార్, ఎండీ పురుషోత్తం దాస్, సీఈవో, డైరెక్టర్ల ఇళ్లతో పాటు సోలిపురం వెంకట్ రెడ్డి ఇళ్లల్లోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. మహేష్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లో రూ.300 కోట్ల నిధుల గోల్ మాల్ పై హైదరాబాద్ సిటీ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ విచారణ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. అనర్హులకు రుణాలు ఇచ్చి.. హవాలా ద్వారా డబ్బులు మళ్లించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ ఇతర రాష్ట్రాల్లోనూ సేవలు అందిస్తోంది. అయితే బ్యాంకులో రుణాల వ్యవహారం వివాదాస్పదమవుతోంది. కంపెనీలోని వాటాదారులు ఇతరులతో కుమ్మక్కయి... పెద్ద ఎత్తున రుణాలను అనర్హులకు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ లో కొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. ఈ విషయంపై ఈడీ సమాచారం వెళ్లడంతో సోదాలు నిర్వహించారు. మహేష్ బ్యాంక్ వ్యవహారం మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంది. గతంలో ఆ సంస్థ సైబర్ సెక్యూరిటీని పట్టించుకోలేదు. ఈ కారణంగా సైబర్ దాడులు జరిగాయి. నైజీరియా నుంచి సైబర్ దాడులు జరిగి డబ్బులు ట్రాన్స్ ఫర్ అయ్యాయి. ఆ సమయంలో హైదరాబాద్ సైబర్ పోలీసులు అసలు విషయం తేల్చేశారు. మహేశ్ బ్యాంక్ యాజమాన్యం సైబర్ సెక్యూరిటీపై నిర్లక్ష్యం చేసిందని, అందువల్లే సర్వర్ హ్యాక్ చేసి నగదు పెద్ద ఎత్తున ట్రాన్స్ ఫర్ జరిగిందని దర్యాప్తులో తేలింది. నైజీరియన్ హ్యాకర్లు మొదట బ్యాంకు ఉద్యోగులకు మెయిల్స్, మెస్సేజ్ లు పంపి తరువాత బ్యాంకు సర్వర్ లోకి చొరబడి పలు ఖాతాలకు కొల్లగొట్టిన నగదును ట్రాన్స్ ఫర్ చేశారు. హైదరాబాద్ సైబర్ పోలీసులు నేరుగా ఆర్బీఐ గవర్నర్ కే ఫిర్యాదు చేశారు. సైబర్ సెక్యూరిటీని పట్టించుకోని బ్యాంకు లైసెన్సును రద్దు చేయాలని సైతం ఆర్బీఐకి సూచించారు. అయితే చట్టపరంగా ఒక బ్యాంకు లైసెన్స్ రద్దు చేయడం సాధ్యం కాదని.. మహేశ్ బ్యాంకుకు ఆర్బీఐ భారీ జరిమానా విధించింది. బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా డిపాజిటర్లు, ఖాతాదారుల వివరాలతో పాటు బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యే అవకాశం ఉందని.. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని గట్టిగా మహేశ్ బ్యాంకు నిర్వాహకులను ఆర్బీఐ మందలించింది. ఆ తర్వాత ఇప్పుడు రుణాల స్కామ్ వెలుగు చూడటం సంచలనంగా మారింది. ఈడీ సోదాలు తర్వాత అసలు విషయం ప్రకటించే అవకాశం ఉంది.

## కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం అందోళన

**కాకినాడ, జూలై 31 (ప్రజాస్వరం):** సామాన్యుల పై భారాలు వేస్తూ, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధంగా రూపొందించిన కేంద్ర బడ్జెట్ 2024కు నిరసనగా సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. కాకినాడ లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మంగళవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరు పై ధ్వజమెత్తారు.
ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జీ, జి. బేడిరాణి, నగర సీనియర్ నాయకులు కె. సత్తిరాజు, ట్రేడ్ యూనియన్ నేత సిహెచ్. రాజ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు వేసే చందంగా ఉందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీల సహాయంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ కనీసం విభజన చట్టం హామీలు అమలుకు గాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గాని నిధుల కేటాయింపు గురించి స్పష్టత లేదన్నారు. రాజధాని నిర్మాణానికి గ్రాంట్ రూపంలో కాకుండా అప్పు రూపంలో 15,000 కోట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ద్వారా బీజేపీ మరోసారి మన రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. ప్రజలంతా కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకించాలన్నారు. టిడిపి, జనసేన ఎంపీలు పార్లమెంటు లో రాష్ట్ర ప్రజల వాణి వినిపించి, ప్రత్యేక హోదా సాధించడానికి చిత్తశుద్ధి గా కృషి చేయాలన్నారు. వ్యవసాయం, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

# మరో ముగ్గురు..?

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ సంజయ్, చెవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మంత్రి పొంగులేటి అనుచరుడు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తిరిగి సొంత గూటికి రావాలని డిసైడ్ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇవాల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డితో భేటీ అయినట్లు జరుగుతోన్న ప్రచారం బీఆర్ఎస్ ఘర్ వాపసీ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాలే యాదయ్య కూడా తిరిగి సొంత గూటికీ వస్తారని బీఆర్ఎస్ లోని అగ్ర నేతలు బలంగా చెబుతుండటంతో తెలంగాణ పాలిటిక్స్ ముందు ముందు మరింత రసవత్తరంగా మారే సిట్యూవేషన్స్ కనిపిస్తున్నాయి.బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేల వలసల ప్రవాహం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో మొదలైంది. ఫస్ట్ బీఆర్ఎస్ ను వీడి అధికారం పార్టీలో చేరింది ఎమ్మెల్యే దానం నాగేందరే. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్ తో బీఆర్ఎస్ లో వలసల ప్రవాహం కొనసాగింది. ఒకరి వెంట ఒకరు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరి కేసీఆర్ కు వరుస షాకులు ఇచ్చారు. దానం తర్వాత ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం, పోచారం, సంజయ్, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, బండ్ల, గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ కు టాటా చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ అత్యంత ఆప్తులుగా పేరున్న కడియం శ్రీహరి, పోచారం పార్టీ మారడం గులాబీ పార్టీలో పెద్ద గుబులే రేపింది. అయితే, కాంగ్రెస్ పై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని, ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం రేవంత్ రెడ్డి సర్కార్ పై ఎఫెక్ట్ చూపించిందని పొలిటికల్ కారిడార్స్ లో చర్చ జరగడంతో పాటు పార్టీలో చేరే ముందు ఇచ్చిన ప్రియారిటీ ఆ తర్వాత దక్కడం లేదని వాపోతున్న జంపింగ్ లీడర్స్ తిరిగి గులాబీ గూటికి రావాలని ప్రయత్నాలు షురూ చేసినట్లు టాక్. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్ కు కౌంటర్ గా బీఆర్ఎస్ తెరలేపిన ఘర్ వాపసీలో భాగంగా అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి సొంత గూటికీ వస్తారా లేదా అనేది తెలియాలంటే మరి కొన్ని రోజులు ఆగాల్సిందే.

# అమరావతికి ఇన్నర్ రింగ్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ప్రభుత్వం తాజాగా మరో కీలక ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. నగరానికి తలమానికంగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం అంశంపై దృష్టిసారించింది. విజయవాడ తూర్పు బైపాస్ కి ఎడంగా, కనీసం 20 కిలోమీటర్ల దూరం నుంచి ఐఆర్ఆర్ వెళ్లేలా ఎలైన్ మెంట్ సిద్ధం చేయనుంది. ఇందుకు సంబంధించి భూసేకరణ విధానంలోనూ మార్పుల దిశగా యోచిస్తోంది. గత టీడీపీ హయాంలో సుమారు 180 కిలోమీటర్ల అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు, సుమారు 97.5 కిలోమీటర్ల పొడవైన ఇన్నర్ రింగు రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అమరావతి, విజయవాడ చుట్టూ. తాడేపల్లి, మంగళగిరిలతో పాటు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు ఐఆర్ఆర్ లోపలికి వచ్చేలా ప్లాన్స్ సిద్ధం చేశారు. ఆ తరువాత ఈ అంశాలకు బ్రేక్ పడింది.

భవిష్యత్తులో అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాలు, మంగళగిరి, తాడేపల్లి పట్టణాలు కలిసిపోయి మహానగరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఇక అమరావతి, విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలూ వేగంగా అభివృద్ధి బాటన సాగుతుండటంతో భవిష్యత్తు అవసరాలకు ఐఆర్ఆర్ అవసరమేనని ప్రభుత్వం అంచనాగా ఉంది. ఇక అమరావతి, విజయవాడ నగరాల చుట్టూ 8 వరుసల ప్రధాన రహదారి, నాలుగు వరుసల సర్వీసు రోడ్డుతో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు మూడు ఎలైన్ మెంట్లు గతంలో సిద్ధం చేశారు. ఫుట్ పాత్ తో పాటు సైకిల్ ట్రాక్ ను కూడా ప్లాన్ చేశారు. వీటిల్లో రూ. 6,878 కోట్ల అంచనా వ్యయం ఉన్న రెండో ప్రతిపాదనను దాదాపుగా ఖరారు చేశారు. ప్రాజెక్టును ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజించి అంచనాలూ రూపొందించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి ఐఆర్ఆర్ పై దృష్టి సారించింది.

# మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

### పథకాలు, కార్యక్రమాల కోసం రూ.13,412 కోట్లు ఖర్చు

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఢిల్లీ, జూలై 31 : పార్లమెంట్ లో అడిగిన ప్రశ్నకు వివరాలు వెల్లడించిన మంత్రి సంజయ్. దేశంలోని మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రూ.13,412 కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను నిర్వహించే పరిశోధకులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా? ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు హోం మంత్రి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఆ వివరాలను సభలో వివరించారు.

ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం కోసం రూ.3375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24 కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్ కోసం రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణ కోసం రూ.950 కోట్లు, రాష్ట్ర సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75 కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీల ఆధునీకరణకు రూ.354.25 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్ట్ కోసం రూ.2840 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే, శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5 కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60 కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, యూనిట్ కోసం రూ.113.76 కోట్లు, మహిళా హెల్ప్ డెస్కుల కోసం రూ.164.2 కోట్లు, చండీఘడ్ లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటు కోసం రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణ కోసం రూ.224.76 కోట్లు, సెంట్రల్ విక్టిమ్ కాంపోజిషన్ ఫండ్ కోసం రూ.200 కోట్లు, ఢిల్లీ పోలీస్ స్కీం ఫర్ ప్రొవైడింగ్ ఫెసిలిటీ ఆఫ్ సోషల్ వర్కర్స్ , కౌన్సిలర్స్, న్యూ బిల్డింగ్ ఫర్ విమెన్ సెంట్రిక్ ఫెసిలిటీస్ ఫర్ స్పెషల్ నీడ్స్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కోసం రూ.38.8 కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ స్కీం కోసం రూ.2254 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మొత్తంగా రూ.13,412 కోట్లు మన అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, బిడ్డల కోసం ఖర్చు పెడుతున్నట్లు వివరించారు.

## నేడు కందుకూరు లో సీఎం రేవంత్ పర్యటన

**మహేశ్వరం జూలై 31, (ప్రజాస్వరం):** ఆగస్టు ఒకటో తేదీన కందుకూరు లో స్కిల్ యూనివర్సిటీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు మహేశ్వరం నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు. తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఉద్యోగ అవకాశాలు ఆయా రంగాలలో త్వరగా పొందడానికి అవకాశం ఉంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో కళాశాలలో,మెడికల్,ఎంటర్టైన్మెంట్ హబ్స్,వివిధ సంస్థల కంపెనీలు వేర్పాటే లక్ష్యంగా పనిచేస్తానని లక్ష్మారెడ్డి తెలిపారు.

# ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా..?



(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి సవాల్ చేశారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ నేతలు... తెలంగాణ యువకులతో చెప్పిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం గాలి మాటలే చెబుతుంది కానీ ఇంత వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. తమ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన వారిని తమ ఖాతాల్లో వేసుకున్నారని ఆరోపించారు. కేవలం అపాయింట్ మెంట్ లెటర్స్ ఇచ్చినమంత మాత్రాన ఉద్యోగాలు ఇచ్చినట్టు కాదన్నారు కేటీఆర్.

**సీఎంగా భట్టి విక్రమార్క**

తెలంగాణ అసెంబ్లీలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క భవిష్యత్ లో సీఎం కుర్చీలోకి వెళ్లాలని మనసారా కోరుకుంటున్నట్టు చెప్పారు. భట్టి విక్రమార్కకు ఆ అర్హత ఉందని కేటీఆర్ అన్నారు. గత పదేండ్ల లో ఏం మంచి జరిగిందో చెబుదామంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందన్నారు. పదేళ్ల తర్వాత తెలంగాణ గురించి ప్రస్తావించే సందర్భంలో ముందు ఉన్న పరిస్థితులను కూడా మననం చేసుకోవాలని.. గత ప్రభుత్వం.. గతం గతం అంటూ పురావస్తు శాఖ తవ్వినట్టు తవ్వుతూనే ఉన్నారు అధికారం పార్టీపై మండిపడ్డారు. మాకు కూడా తప్పదు మేం కూడా తవ్వాలి. మాట్లాడితే కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని అంటున్నారని.. చెరిపేయలేని, తుడిపేయలేని, దాచెయ్యలేని ఆనవాళ్లు కేసీఆర్ ఆనవాళ్లు. ఎలా చెడిపేస్తారు కేసీఆర్ ఆనవాళ్లను అని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. చర్చ సమయంలో కేటీఆర్ వర్సెస్ మంత్రుల మధ్య మాటల యుద్ధం సాగింది. బడ్జెట్లో కోతలు, ఎగవేతలతో మసిబూసి మారేడుకాయ చేశారు. రైతు భరోసాకు బడ్జెట్ ఏదని ప్రశ్నించారు. పెన్షన్ డబుల్ చేసే కేటాయింపులు ఎక్కడని .. కాంగ్రెస్ తీరు ఎన్నికల ముందు రజినీకాంత్, తర్వాత గజినీకాంత్ లా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ.. మభ్యపెడితే ఊరుకోదని కేటీఆర్ అన్నారు. చార్జిషీట్లు, రికవరీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై వేయాలని విమర్శించారు. ద్రవ్య వినిమయ బిల్లు సందర్భంగా రాజకీయ అంశాలు చర్చకు రావడంతో చర్చ పక్క దారి పట్టింది. రెండు సార్లు సభ వాయిదా పడిన తర్వాత ...మళ్లీ చర్చ జరగలేదు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం, 31 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో
# ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ



న్యూఢిల్లీ, జూలై 31 (ప్రజాస్వరం): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఈ స్కామ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసిన కేసులో కవిత జ్యుడిషియల్ రిమాండ్‌ను ట్రయల్ కోర్టు మరోసారి పొడిగించింది. ఆగస్ట్ 13 వరకు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎమ్మెల్సీ కవితను ఈ ఏడాది మార్చి 16న ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఈడీ కేసులో ఇవాళ్టితో కవిత జ్యుడిషియల్ రిమాండ్ ముగియడంతో అధికారులు వర్చువల్‌గా ఆమెను న్యాయస్థానంలో హాజరు పర్చారు. కేసు విచారణ కీలక దశలో ఉన్నదని.. ఈ సమయంలో కవిత కస్టడీని పొడగించాలని ఈడీ తరుఫు లాయర్లు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈడీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం కవితకు మరో 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది.

## 10 నెలల పాలనపై
# వందల ఆరోపణలా..

### కేటీఆర్ 100 శాతం ఆర్టిఫీషియల్, 0 శాతం ఇంటెలిజెన్స్
### ముచ్చర్లలో ఫోర్త్ సిటీ... అదే ఫ్యూచర్ సిటీ
### కేసీఆర్ చీల్చి చెండాడుతానంటే.. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకొచ్చా...
### అసెంబ్లీలో సీఎం రేవంత్ ఎదురుదాడి



హైదరాబాద్, జూలై 31(ప్రజాస్వరం): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు గొప్ప అనుభవాలే మిగిలాయని సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. బుధవారం అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభను తప్పుదోవ పట్టించేందుకు కేటీఆర్‌కు ఇచ్చిన సమయాన్ని వినియోగించుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. సూచన అనే ముసుగులో ప్రజల మెదళ్లలో మోసం జొప్పిస్తున్నారని ఫైర్ అయ్యారు. వారి పాలనా అనుభవాలతో ప్రజలకు కాంగ్రెస్ అధికారం కట్టబెట్టారని సెటైర్లు వేశారు. పది నెలలు కూడా పూర్తి కాని తమ ప్రభుత్వం విపక్షాలు వందల ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సూరత్ నుంచి చీరలు తీసుకొచ్చి నిరుపేదలను మోసం చేసింది నిజం కాదా అని ధ్వజమెత్తారు. ఎయిర్‌పోర్టుకు ఎంఎంటీఎస్‌ను నిర్మిస్తున్నామని కేంద్రం అంటే తిరస్కరించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రేపు మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ముచ్చర్లలో సాయంత్రం 4 గంటలకు స్కిల్ వర్సిటీ ప్రారంభిస్తున్నామని తెలిపారు.

### తప్పుదోవ పట్టించొద్దు

కేటీఆర్ 100 శాతం ఆర్టిఫీషియల్, 0 శాతం ఇంటెలిజెన్స్ అని, ఆయన సభను తప్పుదోవ పట్టిస్తూ ముచ్చర్ల దగ్గర భూసేకరణపై రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ డెవలప్ అయినట్లుగానే ముచ్చర్లలో ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నామని, ఈ ఫోర్త్ సిటీయే రేపటి ఫ్యూచర్ సిటీ అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముచ్చర్లలో భూసేకరణకు సంబంధించి ఫార్మాసిటీతో పాటు అలాయిడ్ ఇండస్ట్రీస్ కోసం భూసేకరణ చేస్తున్నామని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నామన్నారు. ముచ్చర్లలో ఫార్మా, అలాయిడ్ ఇండస్ట్రీతోపాటు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని, రేపు సాయంత్రం యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తామన్నారు. హైటెక్ సిటీ వద్ద ఉన్న ఎన్ఏసీని అక్కడికి షిఫ్ట్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ఎంఎంటీఎస్ సౌకర్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తే వద్దని తిరస్కరించింది కేసీఆర్ కాదా అని రేవంత్ ప్రశ్నించారు. 2.5 కిలోమీటర్ల దూరం భూమి కేటాయిస్తే పేదలకు ఉపయోగపడే ఎంఎంటీఎస్ విమానాశ్రయం వరకు వచ్చేదికదా అని అన్నారు. దీని వెనుక ఉన్న ఆర్థిక కుట్ర తెలంగాణ ప్రజలకు తెలియాలన్నారు. కేసీఆర్ సభకు రాకపోవడంపై స్పందిస్తూ.. సభలో చీల్చి చెండాడుతామంటే ముందస్తు జాగ్రత్తగా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ కూడా తీసుకొచ్చామని సెటైర్ వేశారు.

## సబితమ్మ నన్ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి..
## పార్లమెంటు ఎన్నికల్లో మోసం చేశారు...

హైదరాబాద్, జూలై 31(ప్రజాస్వరం): తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ మీ వెనకాల కూర్చున్న అక్కలు నమ్మించి మోసం చేస్తారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అనంతరం పలువురు మంత్రులు కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. దీంతో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సీరియస్ అయ్యారు. మాట మాటకు నన్నే టార్గెట్ ఎందుకు చేస్తున్నారని.. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డిని పార్టీలో చూపించుకుని ఆశీర్వదించింది నేను కాదా.. సీఎం రేవంత్ రెడ్డి గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నన్ను ఆశీర్వదించిన మాట వాస్తవం. కానీ తీరా పార్లమెంట్ ఎన్నికల సమయంలో తనను మోసం చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఆ సమయంలో కేసీఆర్ మాయమాటలు నమ్మి నన్ను మోసం చేశారని.. తనను మోసం చేశారు కాబట్టి.. సబితమ్మను నమ్మొద్దని కేటీఆర్ కు చెబుతున్నానని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో చెప్పుకొచ్చారు.

## ద్రవ్యవినియమ బిల్లుకు శాసనసభ ఆమోదం

తెలంగాణ శాసనసభ రేపటికి వాయిదా పడింది. ఇవాళ సభలో ద్రవ్య వినిమయ బిల్లును డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం సభలో గందరగోళం ఏర్పడగా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన, నిరసనల మధ్యే ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ సభను రేపటికి వాయిదా వేశారు.

## ఏం మొహం పెట్టుకొని అంటున్నారు..
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పార్టీలో పదవులు అనుభవించి స్వలాభం కోసం బీఆర్ఎస్ వెళ్లారని, ఏం మోహం పెట్టుకొని సీఎం గురించి మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సీఎం చేసిన వ్యాఖ్యలపై సబితా ఇంద్రారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సబితా ఇంద్రారెడ్డి గారు చాలా బావోద్వేగంతో మాట్లాడారని అన్నారు. 2004కు ముందు ఆమె వేరే పార్టీలో ఉంటే.. కాంగ్రెస్ పార్టీ పిలిచి టికెట్ ఇచ్చి, మంత్రిని కూడా చేసిందని, అలాగే 2009 లో కూడా మంత్రిని చేసిందని, పదేళ్ల పాటు ముఖ్యమైన పోర్ట్ ఫోలియోలు ఇచ్చి గౌరవం ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. దళిత వర్గాలకు చెందిన నన్ను ప్రతిపక్ష నాయకుడిగా నిర్ణయించిందని తెలిపారు. ఆ సమయంలో నాకు సపోర్టుగా ఉండకుండా వారి స్వలాభం కోసం పార్టీ మారి కాంగ్రెస్ పార్టీని మోసం చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను స్వయంగా నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి మీరు పార్టీ మారితే ఎల్ఓపీ స్టేటస్ పోతుంది. కాంగ్రెస్ పార్టీ మీకు ఏం తక్కువ చేయలేదు.. ఇకపై కూడా తక్కువ చేయదు అని బ్రతిమలాడినా.. ఒక్క సారైనా ఆలోచన చేశారా అని మండిపడ్డారు. మీ అధికారం కోసం, మీ స్వార్ధం కోసం వెళ్లి టీఆర్ఎస్ పార్టీలో చేరి ఇప్పుడు భాదపడుతున్నారని.. ఆవేధన చెందాల్సింది నేనా, కాంగ్రెస్ పార్టీయా, ఈ రాష్ట్రంలోని ప్రజాస్వామ్యమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక ఇంకా ఏం మొహం పెట్టుకొని సీఎం గారిని అంటున్నారని, పార్టీలు మారి పరువు తీసి, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేశారని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు.



# ఐదేళ్లు భరించాల్సిందే..

### రాజ్యాంగంలో రీకాల్ వ్యవస్థ లేదు కదా..
### హామీలు కొండంత... కేటాయింపులు గోరంత
### ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్

హైదరాబాద్, జూలై 31(ప్రజాస్వరం): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కొండంత ఉంటే.. బడ్జెట్ లో నిధులు గోరంత ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. రాజ్యాంగంలో రీకాల్ వ్యవస్థ లేదని.. అందుకే ఈ ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భరించాల్సిందేనని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినా పథకాలను ఏనాడు ఆపలేదని అన్నారు. ఆ సమయంలో ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఆలస్యమైన మాట వాస్తవమని అన్నారు. తమ పాలనలో అప్పులు, రెవెన్యూ బిల్లలకు లోబడి ఉన్నాయని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన నికర అప్పు రూ.3,85,340 కోట్లు మాత్రమేనని గుర్తు చేశారు. అప్పుల గురించి మాట్లాడే ప్రభుత్వం.. తాము సృష్టించిన ఆస్తుల గురించి కూడా మాట్లాడాలని అన్నారు. జీఎస్ డీపీలో తెలంగాణ రాష్ట్ర మెరుగైన స్థానంలో ఉందని, రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.14.65 లక్షల కోట్లకు ఆదాయాన్ని పెంచామని పేర్కొన్నారు. తలసరి ఆదాయంలో మన రాష్ట్రం నెంబర్ వన్ గా ఉందని కేటీఆర్ అన్నారు. ఆరునూరైనా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారని.. మాట తప్పినందుకు మిమ్మల్ని అభినందించాలా అని సెటైర్లు వెశారు.

### అదే నిజమైతే రాజీనామా చేస్తా..

30 వేల ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు.. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఇక్క ఉద్యోగం ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని తెలంగాణ యువత చెబితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు పూర్తి చేసి రిజల్ట్స్ వెల్లడిస్తే.. కాంగ్రెస్ నియామక పత్రాలు మాత్రమే ఇచ్చిందన్నారు.

### రేవంత్ రెడ్డి నాకు మిత్రుడే..

సీఎం రేవంత్ రెడ్డి తనకు మంచి మిత్రుడేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. 18 ఏళ్ల నుంచి రేవంత్ రెడ్డి తనకు పరిచయం అని అన్నారు. కాకపోతే గత పదేళ్ల నుంచి మాకు, ఆయనకు చెడిందని కామెంట్ చేశారు. చిన్న వయసులోనే రేవంత్ రెడ్డికి అదృష్టం కలిసొచ్చిందని.. ఆయన కష్టానికి ఫలితం దక్కిందని అన్నారు.

## కేరళ విషాదం.. 163కు పెరిగిన మృతులు



వయనాడ్, జూలై 31(ప్రజాస్వరం): కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 163 మంది చనిపోయినట్లు కేరళ వైద్యారోగ్య శాఖ బుధవారం ఉదయం తెలిపింది. మరో 91 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో గాయపడిన సుమారు 191 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కొండ చరియలు విరిగిపడి గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. మరోవైపు ఈ గ్రామాల్లోని టీ, కాఫీ తోటల్లో పనిచేసే 600 మంది వలస కూలీల ఆచూకీ దొరకడం లేదని సమాచారం.

